సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.410 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 30.410 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 1,541 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,422
3శాతం జీఎస్టీతో	రూ.5,585
నవర (8గ్రా)	రూ.44,680

గరిష్టం/కనిష్టం
35.9 /28.0

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 66 శాతం ఉంది. సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పొగాకు బోర్డులో ఎరువుల పంపిణీ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ముందుగా ఇండెంట్ పెట్టుకున్న పొగాకు రైతులకు సోమవారం నుంచి ఎరువుల పంపిణీ ప్రారంభిస్తున్నామని వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రైతులు పొగాకు బోర్డు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో వేలం కేంద్రానికి రావాలని తెలిపారు.

పోర్టులో యూరియా దిగుమతి



నౌక నుంచి దిగుమతి అవుతున్న జిప్సం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా యూరియా దిగుమతి జరుగుతున్నట్టు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా నార్డ్ అంటారస్ అనే నౌక ద్వారా 60 వేల టన్నుల యూరియా దిగుమతి జరుగుతోంది. అలాగే, బెక్స్ ఏంజల్ అనే నౌక నుంచి 1.63 లక్షల టన్నుల జిప్సమ్ దిగుమతి చేస్తున్నారు. మరో వైపు కేప్ వాలంకియా అనే నౌక 91 వేల టన్నుల సున్నపురాయి దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంది.

సముద్ర నాచు పెంపకంపై శిక్షణ

• ముగిసిన సింహపురి సేంద్రియ మేళా

నెల్లూరు(సెంట్రల్): మత్స్యకార మహిళల ఉపాధి కోసం సముద్ర నాచు పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన సింహపురి సేంద్రియ మేళా ఆదివారం ముగింపు సందర్భంగా పలువురు మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ సముద్ర నాచు పెంపకంపై వివిధ రకాల మెళకువలను వివరించినట్లు తెలిపారు. మహిళలు 10 నుంచి 20 మంది కలిసి గ్రూపులుగా ఏర్పడి నాచు పెంపకం చేపట్టవచ్చన్నారు. ఇందులో మహిళలకు 60 శాతం సబ్సిడీ కూడా ఉందన్నారు. మిగిలిన నగదు బ్యాంక్ రుణాల రూపంలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జేడీ సురేష్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అపస్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న అపస్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక అపస్ జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అపస్ జిల్లా అధ్యక్షుడిగా రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా మణికంఠాచారి నియమితులయ్యారు. అనంతరం నూతన జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ సంచాలకులు బాలు సుబ్బారావు, అపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు ఎన్నికల అధికారులుగా, అపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, సహాధ్యక్షుడు చక్రపాణి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, నూతన ఆర్థిక కార్యదర్శి మణికంఠాచారి నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని అపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన



నెల్లూరు రూరల్: నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎంల గోదాములో మొదటి విడత తనిఖీలను సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ ఆదివారం పరిశీలించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను భద్రపర్చాలని సూచించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను తనిఖీ చేయనున్నామని అధికారులు వెల్లడించారు.

■ జయజయహే జగన్మాత



నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో చండీ అలంకారం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఆదివారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సహస్ర నామ, శ్రీదేవీ ఖడ్గమాల, అష్టోత్తర, సామూహిక నవావరణ, కుంకుమ పూజలు, చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెల్లూరులోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం తదితర దేవాలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– నెల్లూరు(బృందావనం)



నెల్లూరులోని మెక్లిన్స్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకారం



స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భవానీ అలంకారం

ఆక్వాపై నకిలీ పంజా



ఒకప్పుడు ఆక్వా రంగం డాలర్లు పండించింది. అనంతరం సీడ్ హేచరీలు, ఫీడ్ వ్యాపారుల చేతిలో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. హేచరీలు నాసిరకం సీడ్‌తో రైతులను దగా చేస్తూ కనీస నాణ్యత లేని రొయ్య పిల్లలను ఆక్వా రైతులకు అంటగడుతున్నాయి. చెరువులో వదిలిన కొన్ని నిమిషాలకే సగం పిల్లలు చనిపోతుంటే.. మిగిలినవి వైరస్‌లతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేస్తూ రైతులు అప్పుల పాలవుతున్నారు. దీంతో సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

- కుదిపేస్తున్న నాసిరకం సీడ్
- కృత్రిమ పద్ధతిలో రొయ్య పిల్లల ఉత్పత్తి
- ప్రశ్నార్థకంగా మారుతున్న సాగు
- రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు



సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలోనే ఆక్వా సాగుకు జిల్లా ఆయువు పట్టు. రెండున్నర దశాబ్దాల క్రితం ఆక్వా రంగాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన టైగర్ రొయ్యల సాగును నాసిరకం సీడ్ పూర్తిగా కనుమరుగు చేసింది. ఇప్పుడు వెనామీ వంతైంది. జిల్లాలో ఉలవపాళ్ల నుంచి మనుబోలు వరకు సముద్ర తీరంలో ఆక్వా సాగు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో సాగైన ఆక్వా ప్రస్తుతం విభజిత జిల్లాలో కేవలం 43,114 ఎకరాల్లోనే సాగవుతోంది. సీడ్ నుంచి ఫీడ్, ప్రోబయోటిక్స్ వరకు నకిలీ, కల్తీలతో ఆక్వా రైతులను నట్టేట ముంచేస్తుండడంతో ఆక్వా రంగం మనుగడను ప్రశ్నార్థకం చేసింది.

హేచరీల అత్యాశే శాపం

నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తికి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఎంపెడా ద్వారా అనుమతి పొందిన హేచరీలకు బ్రూడర్స్ అంటే తల్లి రొయ్యలను సరఫరా చేస్తోంది. తల్లి రొయ్య ద్వారా ఒక దఫాకు ఒక మిలియన్ సీడ్ ఉత్పత్తి అవుతోంది. ఒక బ్రూడర్‌తో 3, 4 సార్లు కన్నా ఎక్కువ సార్లు గుడ్లు పెట్టించకూడదు. అంతకన్నా ఎక్కువ సార్లు గుడ్లు పెట్టిస్తే నాసిరకం పిల్లలు ఉత్పత్తి అవుతాయి. బ్రూడర్స్ నుంచి 1, 2, 3, 4 దఫాల్లో వచ్చిన రొయ్య పిల్లలు నాణ్యతతో పాటు పెరుగుదల ఒకే విధంగా ఉంటుంది. బ్రూడర్స్ ఎంపెడా నుంచి కొనుగోలు చేయడానికి రూ.లక్షల్లో ఖర్చవుతుంది. దీంతో హేచరీల యజమానులు అత్యాశకు పోయి కొన్ని రకాల మందులను వినియోగించి 10 నుంచి 12 సార్లు కృత్రిమంగా గుడ్లు పెట్టించి పిల్లలను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. మొదటి నాలుగు దశల్లో పొదిగించిన సీడ్‌తో 11, 12 దశల్లో వచ్చిన రొయ్య పిల్లలను కల్తీ చేసి రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతుకు ఇచ్చిన రొయ్య పిల్లలు చెరువులో వదిలితే 50 శాతానికిపైగా చనిపోతున్నాయి.

జిల్లాలో..

హేచరీలు	అనుమతి ఉన్నవి
69	18 మాత్రమే

ఆక్వా సాగు విస్తీర్ణం 43,114 ఎకరాలు

జిల్లాలో 18 హేచరీలకే అనుమతి

జిల్లాలో 69 హేచరీలు ఉన్నాయి. అయితే వీటిలో 18 హేచరీలకే ఎంపెడా అనుమతి ఉంది. మిగతా హేచరీల్లో అనధికారికంగా సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. అనుమతి లేని హేచరీలకు ఎంపెడా బ్రూడర్స్ సరఫరా చేయకపోవడంతో వీరు సముద్రంలో దొరికే రొయ్యలను కొనుగోలు చేసి, వాటి ద్వారానే సీడ్ ఉత్పత్తి చేస్తున్నారని సమాచారం. ఇటువంటి హేచరీలు తాము చెన్నై నుంచి గుడ్లు తెచ్చి పొదిగించామని, నేచురల్ (ఎకో) సీడ్, హైజెనిక్ (పరిశుభ్రమైన) సీడ్ అని రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు.

నష్టాల నుంచి బయటపడేందుకు..

ప్రతి పంటలో ఎదురవుతున్న పంట నష్టాల నుంచి బయటపడేందుకు రైతులు సామర్థ్యానికి మించి సీడ్ కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ఎకరా విస్తీర్ణానికి 30 వేల నుంచి 40 వేల వరకు రొయ్య పిల్లలను గుంతల్లో వదలవచ్చు. అయితే నకిలీ సీడ్ కారణంగా సర్వైవల్ ఉండడం లేదని సుమారు ఎకరాకు లక్షకు పైగా సీడ్ వదులుతున్న పరిస్థితి. ఆక్వా సాగు ప్రారంభంలో టైగర్ రొయ్యల సీడ్‌ను ఎకరాకు 15 వేల నుంచి 20 వేల వరకు వదిలేవారు. నాసిరకం సీడ్ కారణంగా ఏకంగా రాష్ట్రంలోనే టైగర్ రొయ్యల సాగు పూర్తిగా కనుమరుగైంది. ఈ దశలో ఎంపెడా విదేశాల నుంచి వెనామీ తీసుకువచ్చింది. ప్రస్తుతం వెనామీ పరిస్థితి కూడా టైగర్ బాటలోనే కనుమరుగయ్యే దశకు చేరుకుంటోందని ఆక్వా నిపుణులు చెబుతున్నారు.

మళ్లీ టైగర్ పునరాగమనం

దశాబ్దన్నరం క్రితం కనుమరుగైన టైగర్ రకాన్ని ఎంపెడా మళ్లీ తీసుకువచ్చింది. విదేశాల నుంచి నాణ్యమైన బ్రూడర్స్ తెచ్చి అన్ని అనుమతులు, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు ఉన్న హేచరీలకే వీటిని సరఫరా చేస్తోంది. అయితే ప్రస్తుతం పెరిగిన పెట్టుబడితో టైగర్ రకాన్ని సాగు చేయలేని పరిస్థితి నెలకొంది.

నాసిరకం మందులను అంటగడుతున్నా

కొందరు వ్యాపారులు కంపెనీలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి రైతులకు నాసిరకం మేత, మందులు అంటగడుతున్నారు. ఎమ్మార్పీ ధరల్లో 50 నుంచి 60 శాతం కమీషన్ ఇస్తుండడంతో నాసిరకం మందులనే విషయం వ్యాపారులకు తెలిసినా రైతులకు విక్రయిస్తున్నారు. అయితే ఆక్వా రైతులకు అండగా నిలవాల్సిన కోస్టల్ ఆక్వా అథారిటీ, ఎంపెడా వంటి సంస్థలు నాసిరకం మందుల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయి. నాసిరకం సీడ్ విషయంలో అప్పుడప్పుడూ హడావుడి చేసే అధికారులు నకిలీ మందుల విషయంలో మాత్రం నోరు మెదపడడం లేదు.

ఆక్వా రంగానికి వెన్నుదన్ను

రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆక్వా రైతులు నష్టపోకుండా 2022 ఏప్రిల్ 1న 'ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' చట్టాన్ని తీసుకువచ్చింది. ప్రతి జిల్లాలో ఆక్వా సీడ్ నాణ్యత పరిశీలనకు టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటుతోపాటు ఆక్వాకు గిట్టుబాటు ధరల కల్పన, ఎగుమతులకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యతను ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చూస్తోంది. ఇదే సమయంలో ఆక్వా విద్యుత్ యూనిట్‌ను రూ.1.50కే అందిస్తోంది. తొలుత ఐదెకరాల రైతులకే విద్యుత్ సబ్సిడీ ఉంటే.. తాజాగా పదెకరాల రైతులకు సబ్సిడీ అందిస్తోంది.

సీడ్ నాణ్యత లేదు



ఆక్వా సాగు తీవ్ర నష్టాలను మిగిలిస్తోంది. ప్రధానంగా హేచరీల నుంచి నాణ్యమైన సీడ్ అందుబాటులోకి రావడం లేదు. దీంతో వ్యాధులు పెరగడం, సరిగా పెరుగుదల లేకపోవడం వంటివి జరుగుతున్నాయి.

– తులసీరాం, కొరుటూరు

ఖర్చు ఎక్కువ.. రాబడి తక్కువ



ఆక్వా సాగులో ఫీడ్, సీడ్, విద్యుత్ బిల్లులు, ఖర్చులు గతం కన్నా ఎక్కువయ్యాయి. రొయ్యల రేట్లు మాత్రం తక్కువగా ఉన్నాయి. రైతు ఎంత కష్టపడి పంట తీసినా మిగిలేది ఏమీ ఉండదు. వ్యాధులను తట్టుకొని పంట చేతికి వచ్చే పరిస్థితి కనపించడం లేదు.

– కె.వెంకటరమణయ్య, గంగపట్నం పల్లిపాళెం

తనిఖీలు చేస్తున్నాం

జిల్లావ్యాప్తంగా హేచరీలపై, నాసిరకం సీడ్స్‌పై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 40 హేచరీలను తనిఖీ చేసి నమూనాలను ఎంపెడా ల్యాబ్‌కు పంపాం. ఆ రిపోర్ట్‌లో వైరస్ టెస్ట్ పాజిటివ్ రిజల్ట్ వస్తే సంబంధిత హేచరీలపై చర్యలు చేపడతాం.

– నాగేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ నెల్లూరు

విద్యుత్ ఆదా.. భవిష్యత్‌కు భరోసా



నెల్లూరులోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన కార్యాలయం

- కోతలు లేకుండా సరఫరా
- జిల్లాలో నెలకు 140 లక్షల యూనిట్ల వినియోగం
- వేసవిలో 160 లక్షల యూనిట్ల వాడకం
- భాగస్వాములవుతున్న వినియోగదారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నప్పటికీ విద్యుత్ సంస్థ డిమాండ్‌కు తగ్గట్టుగా ఎలాంటి కోతలు లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. అదే క్రమంలో విద్యుత్‌ను పొదుపుగా వాడడంపై దృష్టి పెట్టింది. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లే అనే నినాదంతో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏపీఎస్పీడీసీఎల్‌కు ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో మొత్తం 12,37,429 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో పలు కేటగిరీల వారీగా సర్వీసులు అందిస్తూ విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ అందుకు తగ్గట్టుగా ఎలాంటి అప్రకటిత విద్యుత్ కోతలు విధించకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంది. మొత్తం విద్యుత్ వినియోగంలో ఏటా గృహ అవసరాలకే 75 శాతం వినియోగిస్తున్నాం. ఇలాంటి గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్‌ను పొదుపుగా వాడడం వల్ల విద్యుత్‌ను ఆదా చేసి భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యుత్ అందించే వీలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీల్లోని గృహాలకు ఇంధన పొదుపు పాటించేలా ఇంధన సామర్థ్య విధానాలను అమలు చేసేందుకు విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇళ్లలో ప్రపంచశ్రేణిలో ఇంధన సామర్థ్య టెక్నాలజీని అమలు చేయాలని విద్యుత్‌శాఖ నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ' సహకారం తీసుకుంటోంది. తద్వారా 20 శాతం విద్యుత్ బిల్లులు తగ్గే అవకాశం ఉంది.

జిల్లాలో కేటగిరీల వారీగా ఉన్న విద్యుత్ సర్వీసుల వివరాలు

కేటగిరీ	సర్వీసుల సంఖ్య
గృహ సర్వీసులు	8,99,151
వ్యాపార సర్వీసులు (వాణిజ్యం)	97,411
పరిశ్రమల సర్వీసులు (ఎల్‌టీ)	4,240
పరిశ్రమల సర్వీసులు (హెచ్‌టీ)	814
జనరల్ పర్పస్	25,353
వ్యవసాయ సర్వీసులు	1,85,080
ఆక్వా సర్వీసులు	25,380

వినియోదారుల భాగస్వామ్యం

విద్యుత్ పొదుపులో వినియోగదారులను భాగస్వామ్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రతి ఏడాది డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు 'జాతీయ ఇంధన పొదుపు' వారోత్సవాలను నిర్వహిస్తూ వినియోగదారుల్లో విద్యుత్ వినియోగం, ఆదాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరూ విధిగా పాటించాల్సిన విధానాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. విద్యార్థులు, రైతులు, వినియోగదారులు, పారిశ్రామిక వర్గాలను వారోత్సవాల్లో భాగస్వాములను చేసి వారికి విద్యుత్ పొదుపుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్ ఆదా ఇలా..

వినియోదారులు కూడా స్వయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. అది ఎలా అంటే ఒక్క యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్టేనని గ్రహించాలి. ప్రధానంగా అవసరం లేని సమయాల్లో విద్యుత్ పరికరాలను వినియోగించకుండా చూడడంతోపాటు ఇళ్లలో వాడే ఫ్రిజ్, ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీ, ఫ్యాన్, మిక్సీ, వాటర్ హీటర్, మోటార్ల వంటి విద్యుత్ పరికరాలు 5 స్టార్స్ రేటింగ్స్ కలిగిన వాటినే వినియోగించాలి. అలాగే సాధారణ బుల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు వాడడం, రైతులు వాడే విద్యుత్ మోటార్లు ఐఎస్ఐ మార్కు కలిగిన వాటిని వాడడం ద్వారా విద్యుత్ ఎంతో ఆదా అవుతుంది.

అంతరాయం లేకుండా సరఫరా



జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. విద్యుత్ ఆదాపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎల్‌ఈడీ బల్బుల వాడకం, నాణ్యమైన 5 స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ గృహోపకరణాలను వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

– విజయన్, జిల్లా సర్కిల్ ఎస్‌ఈ, ఏపీఎస్పీడీసీఎల్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్ బట్వాడీపాళెంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 36వ డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి మరో రూ.80 లక్షల మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన చోట్ల నిధులు కేటాయిస్తామన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఇటీవల ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా ఏర్పడిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అవినీతికి ఏమాత్రం తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న విమర్శల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కార్పొరేటర్ పిండి శాంతి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పిండి సురేష్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువులో బోడపాటి సుబ్బరాయుడిపై ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసుపై కావలి డీఎస్పీ వెంకటరమణ విచారణను ఆదివారం చేపట్టారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో కాపలాదారుడిగా జయంపు పోలయ్య పనిచేస్తున్నారు. ఈ నెల 2న సుబ్బరాయుడికి చెందిన గేదెలు పొలంలోకి ప్రవేశించాయి. ఈ విషయమై సుబ్బరాయుడ్ని ప్రశ్నించగా, కులం పేరుతో దూషించి నానా దుర్భాషలాడాడంటూ పోలీసులకు పోలయ్య ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి డీఎస్పీ చేరుకొని విచారణ చేపట్టారు. ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్సై విజయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



కావలి: బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మరణించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ వివరాల మేరకు.. పట్టణంలోని వైకుంఠపురంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీకి చెందిన గుంజి శ్రీనివాసులు మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బాకీ వసూలుకు గానూ తన సహచర కార్మికుడు మధుబాబు (32)తో కలిసి అన్నాగారిపాళేనికి బైక్‌పై బయల్దేరారు. తుమ్మలపెంట సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో బైక్ నడుపుతున్న మధుబాబుకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మరణించారు. ఘటనలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రింగు వల ధ్వంసం



ఉలవపాడు: మండల పరిధిలోని రామాయపట్నం పల్లెపాళేనికి చెందిన మాకా నాగరాజుకు చెందిన వల సముద్రంలో ధ్వంసమైంది. రింగు వల పెద్దదిగా ఉండటంతో బోటుతో పాటు సముద్రంలో లంగరు వేసి ఉంచుతారు. వేటకు వెళ్లినప్పుడు అక్కడి నుంచే తీసుకెళ్తారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు, అమావాస్య కావడంతో అలలతో వల లంగరు నుంచి తెగి ఒడ్డుకు వచ్చింది. వల విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటుందని మత్స్యకారుడు నాగరాజు తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే వెన్నులో వణుకే

ఉరుకులు.. పరుగుల జీవనం.. ఏడెనిమిది గంటల పాటు కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేయడం.. తగ్గిన శారీరక శ్రమ.. పని ఒత్తిడి.. ఇలా ఎన్నో కారణాలు వెన్నెముకను కుంగదీస్తున్నాయి. ఎవర్ని పలకరించినా నడుము నొప్పో.. మెడ నొప్పో అనడం సాధారణమైంది. శరీరానికి సరైన సౌష్టవం, ఆకృతినే కాకుండా నిటారుగా నిలిచేందుకు దోహదపడే వెన్నెముక డిస్క్ సమస్యలతో కుంగిపోతోంది. ప్రపంచ వెన్నెముక దినోత్సవం (వరల్డ్ స్పైన్ డే)ను పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

కాల్షియం లోపంతో వెన్ను సమస్యలు

- ఏమరుపాటుగా ఉంటే జీవితాంతం వేదనే
- అందుబాటులోకి అత్యాధునిక చికిత్సలు
- ప్రపంచ వెన్నెముక దినోత్సవం నేడు

నెల్లూరు(బారకాసు): శరీరంలో వెన్నెముక ప్రధానమైంది. కనీస అవగాహన ద్వారా వెన్నెముకకు వచ్చే సమస్యలు చాలా వరకు నయమవుతాయి. వెన్నెముకపై భారం పడకుండా చూసుకోవడం.. తగిన రీతిలో కూర్చోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే సమస్యలు చాలా వరకు దరిచేరవు. అయితే ఈ సమస్యలతో బాధపడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

యువతనూ కలవరపెడుతోంది..

మందులకు కూడా లొంగని సమస్యలకు నేడు అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు 40 నుంచి 60 ఏళ్ల వారికి వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువతనూ కలవరపెడుతోంది. పెద్దవారిలో ఐదు శాతం మంది తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు.

సక్రమంగా కూర్చోకపోవడమూ కారణమే

రోజంతా కంప్యూటర్ల ముందు కూర్చొని ఉండటం డిస్క్ సమస్యలకు ఒక కారణమైతే.. సరైన భంగిమలో కూర్చోకపోవడం మరో కారణమవుతోంది. ఒక వైపే ఒత్తిడి పడేలా కూర్చోవడంతో ఆ భాగంలోని డిస్కులు తొందరగా దెబ్బతింటున్నాయి. సరైన వ్యాయామం లేక బలహీనమవుతున్నాయి. రోజంతా కంప్యూటర్ ముందు పనిచేసినా, టీవీ చూసినా మెడ దగ్గర కండరాలు, డిస్కులు ఒత్తిడికి గురవుతాయి. అందుకే మెడనొప్పి మొదలవుతుంది. సరైన విధంగా కూర్చోకపోవడంతో నడుముపై ఒత్తిడి పడి డిస్కులు జారిపోవడం, దెబ్బతిని నడుము నొప్పులొస్తున్నాయి.



పాటించాల్సిన జాగ్రత్తలు

- అధిక శరీర బరువుతో వెన్నెముకపై ఒత్తిడి పడుతుంది. బరువు పెరగకుండా చూసుకోవాలి.
- కూర్చున్నప్పుడు, నిలుచున్నప్పుడు నిటారుగా ఉండటం ద్వారా ఇలాంటి నొప్పులు దరి చేరకుండా చూసుకోవచ్చు.
- శక్తికి మించిన బరువులు ఎత్తడంతో డిస్కులపై ఒత్తిడి పడుతుంది.
- వ్యాయామంతో కండరాలు బలపడతాయి. డిస్క్ జారే అవకాశం తగ్గుతుంది.

నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదమే

వెన్నుపూసలో కండ తొలగించడం, డిస్క్ దెబ్బతినడం ద్వారా ఈ వ్యాధి వస్తుంది. వెన్నుకు దెబ్బతగలడం ద్వారా వెన్నుపూస విరిగి వ్యాధి తీవ్రమవుతుంది. కణితులతో వీటి ప్రభావం ప్రధాన అవయవాలపై పడుతుంది. మహిళల్లో రుతుస్రావం ఆగిపోవడంతో కాల్షియం లోపించి ఎముకలు పెళుసుబారుతాయి. ఇది వెన్నెముకపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముందుగా గుర్తించి జీవితాంతం కాల్షియం మాత్రలు మింగాలి. లేదంటే వెన్నెముక విరిగిపోయే ప్రమాదం ఉంది.

మంచి ఆహారం, వ్యాయామం అవసరం



రోజూ 15 నుంచి 20 నిమిషాలు వెన్నుకు సంబంధించిన వ్యాయామం చేయడం ద్వారా లిగమెంట్, మజిల్స్‌లోకి రక్తప్రసరణ బాగా ఉంటుంది. జంక్ ఫుడ్స్, మద్యానికి దూరంగా ఉండాలి. దూర ప్రయాణాలు, డ్రైవింగ్ చేయాల్సి వచ్చినప్పుడు మధ్యలో విరామం తీసుకోవాలి. ఆహారంలో కాల్షియం, విటమిన్లు లోపించకుండా చూసుకోవాలి.

– వెంకటేశ్వరప్రసన్న, న్యూరోసర్జన్, జీవీపీ బ్రెయిన్ అండ్ స్పైన్ సెంటర్

నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం ఇబ్బందే



వెన్ను సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మహిళలు వెన్నునొప్పితో ఎక్కువగా బాధపడుతున్నారు. వైద్య చికిత్సలతో పాటు ఫిజియోథెరపీ చేస్తే మంచిది. వెన్నుముక వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి.

– సాయికిరణ్, న్యూరోసర్జన్, నారాయణ ఆస్పత్రి

శారీరక శ్రమ లేకపోవడంతోనే సమస్య



ప్రస్తుత జీవన శైలిలో వ్యాయామం లేకపోవడంతో వయస్సు తేడా లేకుండా అందరిలో వెన్ను సమస్యలొస్తున్నాయి. వెన్ను నొప్పి వచ్చినప్పుడు అశ్రద్ధ వహించకుండా సంబంధిత వైద్యుడ్ని కలిసి తగిన చికిత్స పొందాలి. లేని పక్షంలో నొప్పి భరించలేనంతగా పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆనంద్, న్యూరోసర్జన్, అపోలో హాస్పిటల్

మద్యానికి డబ్బివ్వలేదని..

- యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మద్యానికి డబ్బులివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. రామకోటయ్యనగర్ సమీపంలోని రాజారామిరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న సత్యవతి, మల్లికార్జున దంపతులు స్థానికంగా ప్రొవిజన్స్ షాపును నిర్వహిస్తున్నారు. వీరి కుమార్తె శోభనకు వివాహమై బెంగళూరులో ఉంటున్నారు. అవివాహితుడైన కుమారుడు పార్థసారథి (35) వ్యాపారంలో తల్లిదండ్రులకు సాయం చేస్తూ ఇంట్లోనే ఉంటున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన దాని కోసం డబ్బులను విపరీతంగా ఖర్చుచేయసాగారు. దీంతో పలుమార్లు తల్లిదండ్రులు మందలించారు. మద్యాన్ని మానాలని సూచించినా పెడచెవిన పెట్టారు. 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన సత్యవతి విశ్రాంతి నిమిత్తం తన భర్తతో కలిసి బెంగళూరులోని కుమార్తె వద్దకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న పార్థసారథి మద్యానికి డబ్బులివ్వాలని తల్లిదండ్రులకు పలుమార్లు ఫోన్ చేశారు. ఇవ్వకపోతే చనిపోతానని బెదిరించారు. ఈ క్రమంలో సత్యవతి దంపతులు దైవ దర్శనం నిమిత్తం చెన్నైకు శనివారం వెళ్లారు. నెల్లూరుకు ఆదివారం వారు బయల్దేరగా, మరోసారి కుమారుడు ఫోన్ చేసి డబ్బులు అడిగారు. వచ్చి ఇస్తామని వారు చెప్పగా, మనస్తాపానికి గురైన ఆయన ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంటికి సాయంత్రం చేరుకున్న వారు తలుపులు కొంచెం తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లిచూడగా కుమారుడు ఉరేసుకొని మృతి చెంది ఉండటంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇన్‌స్పెక్టర్ నారాయణ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు నగరాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో గల టిడ్కో కమ్యూనిటీ హాల్లో 53, 54వ డివిజన్లకు సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రెండు డివిజన్లను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేశామని చెప్పారు. పెన్నా ఒడ్డున ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి, రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు ఈ ప్రాంతంలో షాదీమంజిల్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్పొరేటర్లు సఫియాబేగం, దేవరకొండ సుజాత, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.137
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.240
స్కిన్‌లెస్ చికెన్	: రూ.262
లేయర్ చికెన్	: రూ.200

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.5

నేర నియంత్రణే లక్ష్యంగా..

- ప్రమాదాల కట్టడికి స్పెషల్ డ్రైవ్
- నిబంధనల ఉల్లంఘనలపై భారీ జరిమానాలు
- పేకాట, కోడిపందేలు, సింగిల్ నంబర్లాటపై దాడులు

నెల్లూరు(క్రైమ్): నేరాలను నియంత్రించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించడమే లక్ష్యంగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. విజిబుల్ పోలీసింగ్‌తో పాటు పగలు.. రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా శివారు.. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి గస్తీని ముమ్మరం చేశారు. నిరంతర వాహన తనిఖీలతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై దాడులు చేసి ఉక్కుపాదం మోపుతున్నారు. రోడ్డు ప్రమాదాల కట్టడిలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతో పాటు సెల్‌ఫోన్.. ట్రిపుల్.. మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. బహిరంగ మద్యసేవనంపై దాడులను ముమ్మరం చేస్తున్నారు. పోలీసుల చర్యలతో నేరాలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి.

జరిమానాలు ఇలా..

- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఈ – చలానాలు విధించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 73,237 ఈ
- చలానాల ద్వారా రూ.2,28,21,170 మేర అపరాధ రుసుమును విధించారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన 7099 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుల్లో హాజరుపర్చగా, వీరికి రూ.85.42 లక్షల జరిమానాను న్యాయమూర్తులు విధించారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అధిక మోతాదులో మద్యం సేవించిన 14 మందికి మూడు నుంచి ఏడు రోజుల పాటు జైలుశిక్ష విధించారు.
- బహిరంగ మద్యసేవనానికి సంబంధించి 11,689 కేసులు నమోదు చేసి రూ.9,04,200 మేర అపరాధ రుసుమును విధించారు.
- పేకాట కేంద్రాలపై దాడులు నిర్వహించి 165 కేసులు నమోదు చేశారు. 825 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.14,23,898ను సీజ్ చేశారు.
- కోడి పందేలపై జరిపిన దాడుల్లో 27 కేసులు నమోదు చేసి 125 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి కోళ్లు, రూ.1,44,700ను స్వాధీనం చేసుకున్నారు.





వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

మెరుగైన శాంతిభద్రతలే లక్ష్యం



ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచాం. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలి. అసాంఘిక కార్యకలాపాలు.. అనుమానాస్పద వ్యక్తుల సంచారం.. తదితరాలను గుర్తిస్తే డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

సీఎమ్మార్‌లో రెండో వీక్లీ డ్రా



నెల్లూరు(బృందావనం): దసరా, దీపావళిని పురస్కరించుకొని చందన, సీఎమ్మార్ వైభవాల్లో భాగంగా రెండో వీక్లీ హీరో మోటార్ బైక్ డ్రాను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదివారం తీశారు. నగరంలోని చంద్రశేఖరపురానికి చెందిన ఈశ్వరమ్మ (కూపన్ నంబర్ 24348)ను విజేతగా ప్రకటించారు. గత వారం హీరో బైక్ విజేత పద్మావతికి కీని అందజేశారు. వారం రోజుల డైలీ డ్రా విజేతలు 35 మందికి గ్రైండర్, మిక్సీ, రైస్ కుక్కర్, ఇండక్షన్ స్టౌను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడారు. దసరా, దీపావళి సందర్భంగా వేలాది వెరైటీల వస్త్రాలు, బంగారు ఆభరణాలను తక్కువ ధరకే అందిస్తున్నామని వివరించారు. కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.